ANN తెలుగు
Follow: @ANNTELUGU
10-04-2026
# మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 103  పేజీలు-08  వెల-రూ.6
PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM



## ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ కు టీ- ఫైబర్ ఎండీ వేణుప్రసాద్

హైదరాబాద్, మహా: తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలను ప్రపంచంతో పోటీపడేలా చేసే అత్యాధునిక టెక్నాలజీ, వ్యూహాలు కలిగిన టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ ను ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ వేడుకకు ఏఎన్ఎన్ మీడియా సంస్థల సీఈవో కంది రామచంద్రారెడ్డి ఆహ్వానించారు. ప్రభుత్వాల ఆలోచనలు, వేణుప్రసాద్ తన విజన్ తో చేస్తున్న అద్భుతాలు, గ్రామీణ ప్రాంతాల్లో రానున్న మార్పులు, జరుగుతున్న ప్రయోగాల నేపథ్యంలో ఏఎన్ఎన్ డిజిటల్ ఇన్ ఫ్రా విజనరీ పురస్కారాన్ని టీఫైబర్ ఎండీ వేణుప్రసాద్ కు ఇవ్వాలని నిర్ణయించింది. టెక్నాలజీ సరికొత్త పుంతలు తొక్కుతుండగా, మారుమూల గ్రామీణ ప్రాంత పేదలకు కూడా దాని ఫలాలు అందించే బృహత్ సంకల్పంతో టీ ఫైబర్ పనిచేస్తున్నది.

**టాప్ న్యూస్**

### జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ
- బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం




02

### ఇంటర్ ఫలితాలపై పుకార్లను నమ్మకండి
- విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్యాశాఖ కీలక విన్నపం

TELANGANA STATE COUNCIL OF HIGHER EDUCATION
KNOWLEDGE THROUGH EQUITY

02

### పది రోజుల పాటు సెగలే!
- భానుడి విశ్వరూపం.. 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- అగ్నిగుండంగా మారనున్న రాష్ట్రం
- ఏప్రిల్ 12 నుండి డేంజర్ జోన్!



02

## కాళేశ్వరం మూడు బ్యారేజీలకు
# రైట్.. రైట్
### మరమ్మత్తులు చేసి వినియోగించాలని డిసైడ్
### ఎన్డీఎస్ఏ నిబంధనలకు అనుగుణంగా వినియోగం

హైదరాబాద్, మహా : కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులోని మూడు బ్యారేజీలకు మరమ్మత్తులు చేసి వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు వీలైనంత త్వరగా ఈ పనులను వేగవంతం చేయాలని చెప్పారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, ఇతర ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు మరమ్మత్తుల కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందించి నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. మరమ్మత్తులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటిని అప్రమత్తం చేసి పనుల్లో వేగం పెంచాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్స్‌తో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజిని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని సమావేశంలో అధికారులు వివరించారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వడానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. అందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలని ఆదేశించారు. మరమ్మతులకు సంబంధించి డిజైన్లు సిద్ధం చేయాలని సూచించారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపైన పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలన్నారు.



### పనుల్లో జాప్యం వద్దు

పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదని, నిధుల విషయంలో ఇబ్బంది రానివ్వమని సీఎం స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని చెప్పారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు తో పాటు నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేడు హస్తినకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం

వివరాలు 2లో

### పాకిస్థాన్ కేంద్రంగా..
## అమెరికా, ఇరాన్ మధ్య తొలి దశ చర్చలు
### ఇరాన్ ఎజెండా ఆధారంగానే చర్చలు



మహా నెట్ వర్క్: పాకిస్థాన్ వేదికగా అమెరికా, ఇరాన్ మధ్య తొలి దశ చర్చలకు రంగం సిద్ధమైంది. ఇస్లామాబాద్‌లో జరిగే ఈ భేటీలో ఇరుదేశాల నేతలు శాశ్వత శాంతి దిశగా చర్చలు జరపనున్నారు. ఈ భేటీలో పాల్గొనే అమెరికా ప్రతినిధుల బృందానికి ఆదేశ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వం వహించనున్నారు. ఈ చర్చలు ప్రధానంగా ఇరాన్ ప్రతిపాదించిన 10 అంశాల ప్రణాళిక ఆధారంగా జరగనున్నాయి. ఇరాన్‌పై ఆంక్షలు ఎత్తివేత, భవిష్యత్తులో ఇరాన్‌పై దాడులు జరగకుండా హామీ, హర్మూజ్ జలసంధిపై తమ నియంత్రణ కొనసాగాలన్న టెహ్రాన్ డిమాండ్, ఇరాన్ అణు, క్షిపణి కార్యక్రమాల భవిష్యత్తుపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చలు జరిగే అవకాశం ఉంది. తాత్కాలిక కాల్పుల విరమణను శాశ్వత శాంతి ఒప్పందంగా మార్చేందుకు చర్చలకు మధ్యవర్తిత్వం వహిస్తున్న

మిగతా 2లో

### పొంగులేటి కాదు అతడు పొంగు లూటీ
02

మంత్రి పొంగులేటిపై హరీష్ రావు ఆగ్రహం
తప్పు ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్పు



## రైల్వే ప్రయాణికులకు దక్షిణ మధ్య అలర్ట్
### శాతవాహన గోల్కొండ సహా రైళ్లు రద్దు
### రాయనపాడు పనులతో పట్టాలపై రైళ్ల బ్రేక్

హైదరాబాద్, మహా: తెలుగు రాష్ట్రాల మధ్య నిత్యం ప్రయాణించే వేలాది మంది రైల్వే ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే కీలక హెచ్చరిక జారీ చేసింది. విజయవాడ సమీపంలోని రాయనపాడు యార్డ్ ఆధునీకరణ పనుల నేపథ్యంలో పలు ప్రధాన రైళ్లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ఏప్రిల్ 28వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు అమల్లో ఉంటుందని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల భద్రత, రైళ్ల రాకపోకల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చేపట్టిన ఈ పనుల కారణంగా శాతవాహన, గోల్కొండ మరియు గౌతమి వంటి అత్యంత

మిగతా 2లో



## మూడు రాష్ట్రాల్లో భారీగా పోలింగ్
### ఈవీఎంలలో అభ్యర్థుల జాతకాలు

ఢిల్లీ, మహా: దేశ రాజకీయ ముఖచిత్రంపై అత్యంత ఆసక్తి రేకెత్తించిన మూడు కీలక ప్రాంతాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ పర్వం ప్రశాంతంగా ముగిసింది. అటు హిమాలయాల పాదాల చెంత ఉన్న అసోం నుంచి.. ఇటు సుందర తీరాల కేరళ, పుదుచ్చేరి వరకు ఓటరు చైతన్యం వెల్లువెత్తింది. ప్రజాస్వామ్య సమరంలో తమ ప్రతినిధులను ఎన్నుకునేందుకు పౌరులు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎండల తీవ్రతను సైతం లెక్కచేయకుండా వృద్ధులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు



జరగకుండా ఎన్నికల సంఘం అత్యంత కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పోలింగ్ ప్రక్రియ అంతా సుహృద్భావ

మిగతా 2లో






### విద్యపై సీఎం రేవంత్ ఫోకస్ బాగుంది
- ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి
- అత్యున్నత స్థాయికి వెళ్లిన వారందరూ ప్రభుత్వ బడుల్లో చదివిన వారే
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

వివరాలు 2లో

### మినా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో
## హజ్ యాత్రికుల కోసం గ్రాండ్ ఫ్రీ హెల్త్ క్యాంప్
**హజ్ యాత్రికులకు ఉచిత పరీక్షలు.. మెడికల్ కిట్లు.. హెల్త్ క్యాంప్ ప్రారంభించిన టీజీఎంఎఫ్ సీ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్**

హైదరాబాద్ సిటీ: మినా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు ఉచితంగా చికిత్స అందించి మెడికల్ కిట్లు పంపిణీచేసే కార్యక్రమాన్ని తెలంగాణ మైనారిటీ ఫైనాన్స్ కార్పోరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ ప్రారంభించారు. గురువారం ప్రారంభమైన క్యాంప్ 10, 11 హెల్త్ క్యాంప్ ద్వారా పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మెడికల్ కిట్లు కూడా పంపిణీచేశారు. ఈ సందర్భంగా కొత్వాల్ మాట్లాడుతూ మీనా ఆస్పత్రి కరోనా కాలంలోనూ అద్భుత సేవలందించిందని, మైనారిటీలకే కాకుండా అన్నివర్గాల వారికి అతితక్కువ ఖర్చులో సేవలందించే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిగా మీనా ఆస్పత్రి అందరి మన్ననలు అందుకుంటున్నదన్నారు. హజ్ కు వెళ్ళేవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు మెడికల్ కిట్లు కూడా ఉచితంగా అందించడం సామాన్యవిషయం కాదన్నారు. జనరల్ మెడిసిన్, కార్డియాలజీ, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ మేటర్నిటీ, ఎమర్జెన్సీ ,ట్రామా కేర్, ఐసీయూ సదుపాయాలతో అద్భుతంగా ఆస్పత్రి సేవలు అందిస్తున్నదని, ఛైర్మన్ హైదయతుల్లా ఖాన్ రోగులకు తక్కువ ఖర్చుతో సేవలందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మీనా ఆస్పత్రి ఛైర్మన్ హైదయతుల్లాఖాన్, డైరెక్టర్ షోయబా షకూర్ తదితరులు పాల్గొన్నారు. ఆప్తాల్మాలజీ (ఐ కేర్)కు డాక్టర్ హిదయతుల్లా ఖాన్ , డాక్టర్ బాసిత్ హుస్సేన్, గైనకాలజీ లో డాక్టర్ సోహెబా షకూర్, జనరల్ మెడిసిన్ లో డాక్టర్ జవాద్ లు విశేష సేవలందిస్తున్నారు. రిజిస్టర్డ్ యాత్రికులందరికీ భోజనం అందించబడుతుందని, రిజిస్ట్రేషన్ కోసం 04035262700, 040 35262701, 7396084445, 7396084446 నెంబర్లను సంప్రదించాలన్నారు.



# నేడు హస్తినకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం

**హైదరాబాద్, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈనెల 10 న దేశ రాజధాని ఢిల్లీలో పర్యటించనున్నారు. రాష్ట్రంలో పాలనాపరమైన వేగం పెంచడంతో పాటు, పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించిన ముఖ్యమంత్రి..నేటి ఉదయం 10 గంటలకు శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఈ పర్యటన రాజకీయ వర్గాల్లో అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. నేడు మధ్యాహ్నం ఢిల్లీ వేదికగా నిర్వహించనున్న అత్యంత కీలకమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనబోతున్నారు. జాతీయ స్థాయిలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, రాబోయే ఎన్నికల కార్యాచరణపై ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చించనున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ఆరు గ్యారంటీల అమలు తీరును రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా పార్టీ అధిష్టానానికి వివరించనున్నట్లు సమాచారం. ముఖ్యంగా పాలనలో తన మార్కు చూపిస్తూనే, పార్టీ క్యాడర్‌లో నూతనోత్సాహం నింపేలా ఆయన తన నివేదికను సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వెంట ఈ పర్యటనలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్య నేతలు కూడా వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, ఉత్తమ్ కుమార్ రెడ్డిలు కూడా ముఖ్యమంత్రితో కలిసి హస్తినకు ప్రయాణమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఒకవైపు ప్రభుత్వ వ్యవహారాలు, మరోవైపు పార్టీ అంతర్గత అంశాలపై చర్చించేందుకు ఈ పర్యటన ఒక వేదికగా మారనుంది. అధిష్టానంలోని అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలతో కూడా ముఖ్యమంత్రి ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉందని, రాష్ట్ర కేబినెట్ విస్తరణ లేదా నామినేటెడ్ పదవుల భర్తీపై ప్రాథమిక చర్చలు జరిగే వీలుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# పది రోజుల పాటు సెగలే!

**హైద్రాబాద్, మహా:** తెలంగాణ రాష్ట్రంపై సూర్యుడు మునుపెన్నడూ లేని విధంగా నిప్పుల వర్షం కురిపించేందుకు సిద్ధమయ్యాడు. వాతావరణ శాఖ తాజా హెచ్చరికల ప్రకారం, ఏప్రిల్ 12 నుండి 22వ తేదీ వరకు అంటే ఏకధాటిగా పది రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రచండమైన ఉష్ణతరంగాలు వీచనున్నాయి. ఈ పది రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని ప్రతి అంగుళం 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతతో సెగలు కక్కబోతోంది. గాలిలో తేమ శాతం గణనీయంగా పడిపోవడం, ఉత్తర భారతం నుండి వీచే పొడి గాలుల ప్రభావంతో ఈసారి ఎండల తీవ్రత సామాన్యుల ఊహకు అందనంతగా ఉండబోతోందని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో జన సంచారం పూర్తిగా నిలిచిపోయి, రోడ్లన్నీ కర్ఫ్యూను తలపించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.ముఖ్యంగా ఉత్తర మరియు తూర్పు తెలంగాణ జిల్లాలకు వాతావరణ కేంద్రం అత్యంత ప్రమాదకరమైన *'రెడ్ అలర్ట్'* జారీ చేసింది. ఆదిలాబాద్, కుమ్రం భీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, జగిత్యాల వంటి ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు తూర్పున ఉన్న జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ఏకంగా *44 నుండి 45 డిగ్రీల సెల్సియస్‌ను* తాకే అవకాశం ఉంది. ఈ ప్రాంతాల్లోని బొగ్గు గనులు, పారిశ్రామిక క్షేత్రాల వల్ల ఉష్ణోగ్రతల ప్రభావం మరింత రెట్టింపు అయ్యే ప్రమాదం ఉంది. అటు నిజామాబాద్, కరీంనగర్, ఖమ్మం మరియు నల్గొండ జిల్లాల్లో కూడా ఉష్ణోగ్రతలు 43 డిగ్రీల వరకు నమోదవుతూ ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేయనున్నాయి. భాగ్యనగర వాసులకు కూడా ఈ పది రోజులు అగ్నిపరీక్షే అని చెప్పాలి. హైదరాబాద్ నగరంలో ఏప్రిల్ 12 నుండి 22 వరకు నిరంతరాయంగా గరిష్ట ఉష్ణోగ్రతలు *40 నుండి 41 డిగ్రీల* మధ్య నమోదు కానున్నాయి. సాధారణంగా మే నెలలో కనిపించే ఈ స్థాయి వేడి, ఏప్రిల్ మధ్యలోనే నగరాన్ని చుట్టుముట్టడం ఆందోళన కలిగిస్తోంది. నగరంలోని కాంక్రీట్ కట్టడాలు, వాహనాల నుంచి వెలువడే వేడి వల్ల 'అర్బన్ హీట్ ఐలాండ్' ప్రభావం ఏర్పడి, రాత్రి వేళల్లో కూడా ఉష్ణోగ్రతలు తగ్గకుండా ఉక్కపోత తీవ్రంగా ఉంటుంది. ఈ పది రోజుల్లో వర్షాల జాడ చాలా తక్కువగా ఉంటుందని, అక్కడక్కడ కురిసే చెదురుమదురు జల్లులు వేడిని తగ్గించకపోగా, తేమను పెంచి ఉక్కపోతను మరింత పెంచే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు స్వీయ జాగ్రత్తలు పాటించడం అత్యవసరమని వైద్య ఆరోగ్య శాఖ స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, ప్రయాణాలను వీలైనంత వరకు వాయిదా వేసుకోవాలని సూచిస్తున్నారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవడానికి మంచినీరు, ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు వంటివి తీసుకోవాలని, వదులైన కాటన్ వస్త్రాలను ధరించాలని కోరుతున్నారు. వృద్ధులు, చిన్న పిల్లలు మరియు గర్భిణీ స్త్రీలు ఈ ఉష్ణతరంగాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. రాబోయే పది రోజులు రాష్ట్రానికి అత్యంత క్లిష్ట సమయమని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండి ఈ ప్రకృతి విపత్తు నుండి తమను తాము కాపాడుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తోంది.

### సురక్షితంగా ఉండండి

ఎండల పట్ల నిర్లక్ష్యం వద్దు. మీ ఇంటి వద్ద పక్షులు మరియు జంతువుల కోసం చిన్న గిన్నెల్లో నీటిని ఉంచి మూగజీవాలను కూడా కాపాడండి. తరచుగా ద్రవ పదార్థాలు తీసుకుంటూ మిమ్మల్ని మీరు హైడ్రేటెడ్‌గా ఉంచుకోండి.

# ఇంటర్ ఫలితాలపై పుకార్లను నమ్మకండి

## విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్యాశాఖ కీలక విన్నపం

**హైదరాబాద్, మహా:** తెలంగాణలో ఇంటర్మీడియట్ ఫలితాల విడుదలపై గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారమవుతున్న వార్తలపై రాష్ట్ర విద్యాశాఖ స్పందించింది. ఫలితాల తేదీకి సంబంధించి వివిధ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలు కేవలం పుకార్లేనని, వాటిని నమ్మి ఆందోళన చెందవద్దని విద్యార్థులు, తల్లిదండ్రులకు స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది. ఫలితాల వెల్లడిపై బోర్డు ఇంకా అధికారికంగా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని, తప్పుడు వార్తలను వ్యాప్తి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పది లక్షల మంది విద్యార్థులు ఎంతో ఉత్కంఠగా ఎదురుచూస్తున్న ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల ప్రక్రియ ప్రస్తుతం తుది దశలో ఉంది. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను అత్యంత పకడ్బందీగా పూర్తి చేసిన బోర్డు, ప్రస్తుతం సాంకేతిక విశ్లేషణను నిర్వహిస్తోంది. ఫలితాల్లో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఉండేందుకు సాఫ్ట్‌వేర్ తనిఖీలను పదేపదే నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ క్రమంలో, "ఫలితాలు రేపే విడుదలవుతున్నాయి" లేదా "ఫలానా తేదీన వస్తున్నాయి" అంటూ గుర్తుతెలియని వ్యక్తులు సృష్టిస్తున్న పోస్టులు విద్యార్థులను గందరగోళానికి గురిచేస్తున్నాయని బోర్డు అభిప్రాయపడింది.ముఖ్యంగా ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు వెలువడే అవకాశం ఉందని ప్రాథమిక అంచనాలు ఉన్నప్పటికీ, అధికారిక ప్రకటన వెలువడే వరకు విద్యార్థులు సంయమనం పాటించాలని విద్యాశాఖ కోరింది. ఫలితాల తేదీని బోర్డు తన అధికారిక వెబ్‌సైట్ *tsbie.cgg.gov.in* ద్వారా కనీసం ఒకరోజు ముందుగానే మీడియాకు తెలియజేస్తుందని స్పష్టం చేసింది. అనవసరపు వెబ్‌సైట్లను చూసి మోసపోవద్దని, కేవలం ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారా వచ్చే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని సూచించింది. ఫలితాల వెల్లడికి సంబంధించిన పూర్తి కసరత్తు పూర్తయిన తర్వాత, విద్యాశాఖ మంత్రి లేదా ఉన్నతాధికారులు నిర్ణీత సమయంలో మీడియా సమక్షంలో మార్కులను విడుదల చేస్తారని అధికారులు వెల్లడించారు.

# రైల్వే ప్రయాణికులకు దక్షిణ మధ్య అలర్ట్

## శాతవాహన గోల్కొండ సహా రైళ్లు రద్దు

## రాయనపాడు పనులతో పట్టాలపై రైళ్ల బ్రేక్

(మొదటిపేజీ తరువాయి)

రద్దీగా ఉండే రైళ్లు కూడా రద్దు కావడం గమనార్హం. రాయనపాడు పనుల ప్రభావంతో ఏప్రిల్ 28 నుండి మే 5 వరకు విజయవాడ భద్రాచలం రోడ్ (67215/16) మరియు విజయవాడ డోర్నకల్ (67768/67) మధ్య నడిచే రైళ్లు పూర్తిగా రద్దయ్యాయి. అదేవిధంగా, నిత్యం ప్రయాణికులతో కిక్కిరిసిపోయే విజయవాడ సికింద్రాబాద్ విజయవాడ శాతవాహన ఎక్స్‌ప్రెస్ (12713/14) మే 2వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు పట్టాలెక్కదు. గుంటూరు సికింద్రాబాద్ విజయవాడ మధ్య నడిచే గోల్కొండ ఎక్స్‌ప్రెస్ (17201/02) మరియు గుంటూరు సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ (12705/06) కూడా మే 2 నుండి 5వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ స్పష్టం చేసింది.దూరప్రాంత ప్రయాణికులు ఎక్కువగా ఆశ్రయించే విశాఖపట్నం మహబూబ్‌నగర్ విశాఖపట్నం (12861/62) రైళ్లతో పాటు, కాకినాడ పోర్ట్ లింగంపల్లి కాకినాడ పోర్ట్ మధ్య నడిచే గౌతమి ఎక్స్‌ప్రెస్ (12737/38) మే 1 నుండి 5వ తేదీ వరకు నిలిచిపోనున్నాయి. వీటితో పాటు కాకినాడ టౌన్ లింగంపల్లి (12775/76) రైళ్లు మే 3, 4 తేదీల్లో రద్దయ్యాయి. సంబల్‌పూర్ హెచ్.ఎస్. నాందేడ్ (20809/10) రైళ్లు మే 1 నుండి 5 వరకు, విశాఖపట్నం హెచ్.ఎస్. నాందేడ్ (20811/12) రైళ్లు మే 2, 3 తేదీల్లో రాకపోకలు సాగించవు. ఈ భారీ రద్దుల నేపథ్యంలో ప్రయాణికులు ముందస్తుగా తమ ప్రయాణ ప్రణాళికలను మార్చుకోవాలని, స్టేషన్‌కు వచ్చే ముందు రైళ్ల స్థితిగతులను అధికారిక వెబ్‌సైట్ లేదా యాప్‌లో సరిచూసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.



# బీఆర్ఎస్ ఆస్ట్రేలియా అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఇంటికి కేటీఆర్

**కరీంనగర్, మహా :** మాజీమంత్రి జీవన్ రెడ్డి ని బీఆర్ఎస్ లోకి ఆహ్వానించేందుకు జగిత్యాల పర్యటనకు వెళ్తున్న కే టీ ఆర్ మార్గ మధ్యంలో కరీంనగర్ లో ఉన్న బీఆర్ఎస్ ఆస్ట్రేలియా శాఖ అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను కలిసి యోగ క్షేమాలు తెలుసుకున్నారు. నాగేందర్ రెడ్డి ఆస్ట్రేలియా లో పార్టీ బలోపేతానికి చేస్తున్న కృషిని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడేవారిని ఎల్లవేలలా ప్రోత్సహిస్తామని, యువత కు ఇక పై ప్రాధాన్యమిస్తామని కేటీఆర్ తెలిపారు. కే టీ ఆర్ తో పాటు ఎంపీ దామోదర్ రావు, వినోద్ కుమార్, గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, కౌశిక్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే లు, మంత్రులు, మాజీ చైర్మన్ లు పాల్గొన్నారు.

# జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ



## బీఆర్ఎస్‌లోకి ఆహ్వానం

**జగిత్యాల, మహా :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు గురువారం జగిత్యాల జిల్లాలో పర్యటించారు. జిల్లా సరిహద్దుకు చేరుకున్న కేటీఆర్‌కు బీఆర్ఎస్ శ్రేణులు అపూర్వ స్వాగతం పలికాయి. వందలాది బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహిస్తూ, బాణాసంచా కాలుస్తూ పార్టీ కార్యకర్తలు తమ ఉత్సాహాన్ని చాటుకున్నారు. జై కేటీఆర్.. జై బీఆర్ఎస్ నినాదాలతో జగిత్యాల వీధులు హోరెత్తాయి. ఈ పర్యటనలో అత్యంత కీలక ఘట్టం ఎమ్మెల్సీ టీ. జీవన్ రెడ్డితో కేటీఆర్ భేటీ కావడం. గత కొంతకాలంగా కాంగ్రెస్ పార్టీ తీరుపై అసంతృప్తితో ఉన్న జీవన్ రెడ్డి, ఇటీవలే ఆ పార్టీకి రాజీనామా చేశారు. స్వయంగా కేటీఆర్ ఆయన నివాసానికి వెళ్లి చర్చలు జరపడం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బలమైన నాయకుడిగా పేరున్న జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించడం ద్వారా ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ వ్యూహంగా కనిపిస్తోంది. జీవన్ రెడ్డి నివాసం వద్ద కేటీఆర్‌కు స్వాగతం పలికేందుకు భారీగా కార్యకర్తలు తరలివచ్చారు. దాదాపు గంటకుపైగా సాగిన వీరి భేటీలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీలో జీవన్ రెడ్డికి కల్పించబోయే ప్రాధాన్యతపై చర్చలు జరిగినట్లు సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పిస్తున్న జీవన్ రెడ్డి, బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి బాగుందని తాజాగా వ్యాఖ్యానించడం ఆయన పార్టీ మార్పును దాదాపు ఖాయం చేసింది. ఏప్రిల్ 13న లేదా 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన అధికారికంగా గులాబీ కండువా కప్పుకునే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ కేడర్ మనోధైర్యాన్ని దెబ్బతీయడం ఎవరి వల్ల కాదని కేటీఆర్ స్పష్టం చేశారు. జగిత్యాలలో పార్టీకి ఉన్న పట్టును ఈ భారీ బైక్ ర్యాలీ నిరూపించిందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. సీనియర్ నాయకులు పార్టీలోకి రావడం వల్ల మరింత ఉత్సాహం పెరుగుతుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని కేటీఆర్ చెప్పారు. మొత్తానికి కేటీఆర్ జగిత్యాల పర్యటన అటు కార్యకర్తల్లో జోష్ నింపడంతో పాటు, ఇటు ప్రత్యర్థి పార్టీల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. జీవన్ రెడ్డి వంటి మేధావి, సీనియర్ నేత బీఆర్ఎస్ గూటికి చేరితే, అది జిల్లా రాజకీయాల్లోనే కాక రాష్ట్ర రాజకీయాల్లో కూడా పెద్ద మార్పుకు దారి తీస్తుందని భావిస్తున్నారు.

## పాకిస్థాన్ కేంద్రంగా..

## అమెరికా, ఇరాన్ మధ్య

# తొలి దశ చర్చలు

(మొదటిపేజీ తరువాయి)

పాక్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది.ఇందుకోసం పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. శాంతి చర్చలకు మద్దతు కూడగట్టేందుకు ఇప్పటికే సౌదీ అరేబియా, కెనడా, కువైట్ విదేశాంగ మంత్రులతో సంప్రదింపులు జరిపారు.

**హై అలర్ట్ ప్రకటించిన పాక్ ప్రభుత్వం**

అయితే భేటీ దృష్ట్యా ఇస్లామాబాద్ నగరమంతా పాక్ ప్రభుత్వం హై అలర్ట్ ప్రకటించింది. పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేసిన అధికారులు గురువారం, శుక్రవారం రెండ్రోజులు పాటు స్థానికంగా సెలవులు ప్రకటించారు. ఇప్పటికే 30 మంది సభ్యులతో కూడిన అమెరికా భద్రతా బృందాలు ఇస్లామాబాద్‌కు చేరుకొని ఏర్పాట్లను సమీక్షించాయి. అటు ఈ భేటీ కోసం ప్రపంచదేశాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఈ చర్చలు సఫలమైతే పశ్చిమాసియాలో శాంతి నెలకొంటుంది.

## పొంగులేటి కాదు

# అతడు పొంగు లూటీ

### మంత్రి పొంగులేటిపై హరీష్ రావు ఆగ్రహం.. తప్ప ఒప్పుకొని ప్రజలకు క్షమాపణ చెప్ప



**వనపర్తి,మహా:** "పొంగులేటి కాదు.. అతడు 'పొంగులూటీ' అంటూ మాజీ మంత్రి హరీష్ రావు నిప్పులు చెరిగారు. మంత్రి హోదా మరిచి కేవలం 'రాఘవ కన్స్ట్రక్షన్' యజమానిగా పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని, అవినీతి బాగోతం బట్టబయలవడంతోనే 'బాంబులేటి' బాంబులన్నీ తుస్సుమన్నాయని ఎద్దేవా చేశారు. స్వయంగా ముఖ్యమంత్రే రాఘవ కంపెనీ అక్రమాలను ఒప్పుకొని జరిమానా వేశాక, ఇప్పుడు సంబంధం లేదని బుకాయించడం ప్రజలను వంచించడమేనని, ఆ దమ్ముంటే వివాదాస్పద భూములపై హైడ్రాను పంపించి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని హరీష్ రావు సవాల్ విసిరారు." వనపర్తి జిల్లా రేవల్లి మండలం నాగాపూర్ గ్రామంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పొంగులేటిని 'పొగరులేటి', 'పొంగులూటీ', 'బాంబులేటి' అంటూ ఎద్దేవా చేశారు. అత్యంత పవిత్రమైన సచివాలయంలో కూర్చుని పొంగులేటి అబద్ధాలు మాట్లాడుతున్నారని, ఆయన అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో డిఫెన్స్ లో పడి బూతులు, తిట్లు, పిట్ట కథలు చెబుతున్నారని మండిపడ్డారు. మంత్రిగా కాకుండా రాఘవ కన్స్ట్రక్షన్ అధినేతగా, తన కొడుకును కాపాడుకోవడానికే ఆయన ప్రయత్నిస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. రాఘవ కన్స్ట్రక్షన్‌లో జరిగిన అవినీతిని సాక్షాత్తూ ముఖ్యమంత్రే అంగీకరించారని, మైనింగ్ శాఖ ఇల్లీగల్ మైనింగ్ అని నిర్ధారించి ఫైన్ కూడా వేసిందని హరీష్ రావు గుర్తు చేశారు. "ముఖ్యమంత్రి చెప్పింది తప్పా? మైనింగ్ మంత్రి చెప్పింది తప్పా? లేక అధికారుల నివేదికలు తప్పా?" అని ఆయన నిలదీశారు. రాఘవ కన్స్ట్రక్షన్ పేరుతో ఉన్న కంటైనర్ మీద కాంగ్రెస్ జెండా ఎందుకు ఉందని, పీసీబీ మరియు మైనింగ్ అధికారులు నోటీసులు ఇస్తే మీ ఉద్యోగి రిసీవ్ చేసుకున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. అసెంబ్లీలో ఆధారాలు చూపించినప్పుడు నోరు మెదపని 'బాంబులేటి' ఇప్పుడు బుకాయిస్తున్నారని ధ్వజమెత్తారు. నాదార్ గుల్ భూముల వ్యవహారంలోనూ మంత్రి తీరును హరీష్ రావు తప్పుబట్టారు. ఆ భూములను కాపాడింది, హైకోర్టులో పోరాడింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. ఒకవేళ అవి ప్రభుత్వ భూములే అయితే, గత రెండున్నర ఏళ్లుగా ఎందుకు స్వాధీనం చేసుకోలేదని, రోజుకో పేరుతో బోర్డులు ఎందుకు మారుతున్నాయని ప్రశ్నించారు. ప్రభుత్వ భూములను కాపాడతామని చెప్పే 'హైడ్రా' ఇక్కడ గడ్డి పీకుతుందా అని నిలదీశారు. పొంగులేటికి నిజాయతీ ఉంటే, ఆ భూములపై చర్యలు తీసుకోవాలని సవాల్ విసిరారు. "పొగరు తగ్గించుకో పొంగులేటి.. నీ బాంబులన్నీ తుస్సుమన్నాయి. నీ అక్రమాలు ఇంకా చాలా ఉన్నాయి, అన్నీ బయటపెడతాం" అని హెచ్చరించారు. ఇప్పటికైనా చేసిన తప్పు ఒప్పుకొని ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని హరీష్‌రావు డిమాండ్ చేశారు.

# విద్యపై సీఎం రేవంత్ ఫోకస్ బాగుంది

- ప్రభుత్వ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు రావాలి
- అత్యున్నత స్థాయికి వెళ్లిన వారందరూ ప్రభుత్వ బడుల్లో చదివిన వారే
- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి



**మునుగోడు, మహా :** రాష్ట్రంలో ప్రభుత్వ నిద్యలో సమూల మార్పులు తీసుకు రావాల్సిన అవసరం ఉందని, అందుకు సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అద్భుతమని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మునుగోడు మండలం పులిపలుపుల గ్రామంలో ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ విద్యను ప్రోత్సహించడానికి తన వంతు కృషి చేస్తున్నానని అన్నారు. గత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడుల్లో చదివి 10వ తరగతిలో ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన వారికి వరుసగా 15 వేలు, 10 వేలు, 7500 రూపాయల ప్రోత్సాహకం అందించామని, ఈ విద్యా సంవత్సరానికి ఈ ప్రోత్సాహకాన్ని పెంచుతున్నామన్నారు. ఈసారి పదవ తరగతిలో ప్రథమ ద్వితీయ తృతీయ స్థానాలు సాధించిన వారికి 25 వేలు, 15 వేలు, 10 వేల రూపాయలు అందిస్తామని ప్రకటించారు. అత్యున్నత స్థాయికి వెళ్ళిన వారందరు ప్రభుత్వ పాఠశాలలో చదివిన వాళ్లేనని, ప్రభుత్వ పాఠశాలలో చదువు గొప్పగా ఉంటుందని చెప్పారు. మనం మన కుటుంబం గురించి ఎంత ఆలోచిస్తామో సమాజంలో ఉన్న పేద వాళ్ళ గురించి గ్రామం గురించి ప్రాంతం గురించి ఆలోచించినప్పుడే ప్రభుత్వ బడులు అభివృద్ధి చెందుతాయన్నారు. మా అమ్మ కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరు మీద నేను బ్రతికున్నంత వరకు పేదలకు ఆర్థిక సహాయం చేస్తానన్నారు.

> ## నిస్వార్థంగా, నిజాయితీగా పనిచేస్తున్న...
>
> మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిస్వార్థంగా నిజాయితీగా పని చేస్తున్నానని, ఇటీవల కొంతమంది స్థాయికి మించి మాట్లాడుతున్నారని రాజగోపాల్ రెడ్డి మండిపడ్డారు. రాజకీయాల్లో ఉన్నప్పుడు రాజకీయాలు మాట్లాడుకోవాలి, రాజకీయాలు లేనప్పుడు అభివృద్ధి మీదనే దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గంలో స్వాతంత్రం వచ్చిన నాటి నుండి ఇప్పటి వరకు 31 సబ్ స్టేషన్లు నిర్మాణం అయితే, మా ప్రజా ప్రభుత్వం వచ్చిన ఈ రెండేళ్ళలోనే 24 సబ్ స్టేషన్లు మంజూరయ్యాయని, ప్రస్తుతానికి 132 కెవి సబ్ స్టేషన్ లు మూడు ఉండగా, మరో మూడు 132 కెవి సబ్ స్టేషన్లు మంజూరు చేయించానన్నారు. రాబోయే 25, 30 సంవత్సరాలను దృష్టిలో పెట్టుకొని మునుగోడు నియోజకవర్గంలో లో వోల్టేజి సమస్య లేకుండా అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు.

### ఉదయ సముద్రం పనులను నిర్లక్ష్యం చేశారు

వైయస్ రాజశేఖర్ రెడ్డి సీఎంగా పనిచేసినప్పుడు కొట్లాడి మరి తీసుకొచ్చిన ఉదయ సముద్రం బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు 90 శాతం పూర్తయిందని, బీఆర్ఎస్ పదేళ్ళ పాలనలో ఆ ప్రాజెక్టును కావాలని పక్కన పెట్టిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మిగిలిన 10 శాతం పనులని పూర్తి చేసి భూసేకరణ ఆర్ అండ్ ఆర్ పనులను పూర్తి చేయడానికి సీఎం రేవంత్ రెడ్డిని తీసుకొొచ్చి పంపులను ఓపెన్ చేశామని గుర్తు చేశారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మునుగోడు నియోజకవర్గంలోని రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు ఎక్కడినుండి నీటిని తీసుకురావాలనే అంశాన్ని వదిలిపెట్టి కేవలం కమిషన్ల కోసమే బీఆర్ఎస్ రిజర్వాయర్ లు కట్టి వదిలిపెట్టిందన్నారు. మా ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ఏదుల రిజర్వాయర్ నుండి నీటిని తరలించడానికి 1800 కోట్ల రూపాయలను మంజూరు చేయిస్తే పనులు మొదలయ్యాయన్నారు..బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు నుండి మునుగోడు మండలంలోని గ్రామాలకు శాశ్వతంగా సాగు, తాగునీరు అందించడానికి భూసేకరణ పనులు జరుగుతున్నాయన్నారు.

# మూడు రాష్ట్రాల్లో భారీగా పోలింగ్

(మొదటిపేజీ తరువాయి)

వాతావరణంలో సాగింది. సాయంత్రం 5 గంటల సమయానికే మూడు ప్రాంతాల్లోనూ భారీ స్థాయిలో పోలింగ్ నమోదు కావడం విశేషం. మలయాళీ గడ్డపై ఈసారి రాజకీయ చైతన్యం మరోసారి స్పష్టంగా కనిపించింది. కేరళ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 75.01 శాతం ఓటింగ్ నమోదైంది. గత ఎన్నికల కంటే ఇది కొంత మెరుగైన ఫలితం కావడం గమనార్హం. ముఖ్యంగా కోయ్‌కోడ్ జిల్లాలో అత్యధికంగా 77 శాతం మంది ఓటర్లు తమ తీర్పును వెల్లడించారు. 140 అసెంబ్లీ స్థానాల కోసం 883 మంది అభ్యర్థులు బరిలో నిలవగా, హేమాహేమీలంతా తమ మతాధికారాన్ని వినియోగించుకున్నారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్ కన్నూర్‌లో ఓటు వేయగా, కేంద్ర మంత్రి సురేశ్ గోపీ, ప్రతిపక్ష నేత వీడీ సతీషన్, మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖరన్ వంటి ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వెండితెర దిగ్గజాలు మోహన్ లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కూడా సామాన్యులతో కలిసి క్యూ లైన్లలో నిలబడి ఓటు వేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు. మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్ల కోసం ఎన్నికల సంఘం 30 వేలకు పైగా పోలింగ్ కేంద్రాలను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసింది.మరోవైపు ఈశాన్య రాష్ట్రం అసోంలో ఓటరు ప్రభంజనం సృష్టించారు. 126 నియోజకవర్గాల్లో వ్యాపించిన ఈ ఎన్నికల క్రతువులో సాయంత్రం 5 గంటలకే 84.42 శాతం పోలింగ్ నమోదు కావడం రాజకీయ విశ్లేషకులను సైతం ఆశ్చర్యపరిచింది. గత ఎన్నికల్లో 82 శాతంగా ఉన్న పోలింగ్ ఈసారి మరింత పెరగడం విశేషం. ముఖ్యంగా దల్‌గావ్ నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో 94.57 శాతం మంది ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా 722 మంది అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ గువాహటిలో ఓటు వేయగా, కాంగ్రెస్ అగ్రనేత గౌరవ్ గొగోయ్ జోర్హాట్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 59 మంది మహిళా అభ్యర్థులు బరిలో ఉన్న ఈ ఎన్నికల్లో మహిళా ఓటర్ల భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరగడం ఈసారి ప్రత్యేకతగా నిలిచింది. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రజాస్వామ్య పండుగ అత్యంత ఉత్సాహంగా సాగింది. ఇక్కడ ఏకంగా 86.92 శాతం ఓటింగ్ నమోదై దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షించింది. 30 అసెంబ్లీ స్థానాల కోసం జరిగిన ఈ పోటీలో ముఖ్యమంత్రి రంగస్వామి తనదైన శైలిలో బుల్లెట్ బైక్‌పై స్వయంగా డ్రైవ్ చేసుకుంటూ వచ్చి దెలార్ష్‌పేటలో ఓటు వేయడం అందరినీ ఆకట్టుకుంది. మాజీ సీఎం నారాయణస్వామి కూడా తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మీద మూడు ప్రాంతాల్లోనూ పోలింగ్ ముగియడంతో అధికారులు ఈవీఎంలను పటిష్ట భద్రత మధ్య స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అభ్యర్థుల జాతకాలు ఇప్పుడు భద్రంగా నిక్షిప్తమై ఉండగా, అందరి చూపు ఇప్పుడు ఓట్ల లెక్కింపు ఫలితాల పైనే నెలకొంది. ఈ భారీ పోలింగ్ ఎవరికి పట్టం కడుతుందోనని దేశవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

# ప్రజా ప్రస్థానం మహాయాత్రకు 23 ఏళ్లు

11 జిల్లాలు... 68 రోజులు... 640 గ్రామాలు... 1475 కిలోమీటర్లు... లక్షల గొంతుకలు... కోట్ల గుండె చప్పుళ్లు...ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కావు. ఇవి ఒక ఉద్యమానికి, ఒక విశ్వాసానికి, ఒక నాయకుడిపై ప్రజల అపారమైన నమ్మకానికి ప్రతీకలు. ఆ నాయకుడు వైఎస్సార్.2003 ఏప్రిల్ 9న చేవెళ్లలో ప్రారంభమైన "ప్రజా ప్రస్థానం", 2003 జూన్‌లో ఇచ్ఛాపురం వరకు సాగి, ఆంధ్రప్రదేశ్ చరిత్రలో అపూర్వమైన ప్రజా ఉద్యమంగా నిలిచింది. మండుటెండలలో కాలిన పాదాలతో, ప్రజల కష్టాలను తన కళ్లారా చూసి, వారి బాధలను తన హృదయంలో మోసుకుంటూ సాగిన ఈ మహాయాత్ర, ఒక నాయకుడిని మహానాయకుడిగా మలిచింది.

ఆ కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో ప్రజలకు, పాలకులకు మధ్య ఒక గ్యాప్ పెరిగింది. రైతు కష్టాలు, కార్మికుల బాధలు, విద్యార్థుల సమస్యలు ఇవన్నీ అధికార గడపల దాటి బయటకు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ ప్రజల మధ్యకి వెళ్లాలని నిర్ణయించుకోవడం ఒక సాహసోపేత నిర్ణయం.

పాదయాత్రలో ఆయన ఎదుర్కొన్న కష్టాలు సాధారణం కావు. మండుతున్న ఎండలు, దూర ప్రయాణం, శారీరక అలసట ఇవన్నీ ఉన్నా ఆయన అడుగులు ఆగలేదు. ఎందుకంటే అది ఒక వ్యక్తి ప్రయాణం కాదు అది ప్రజల బాధల ప్రతిధ్వని.

640 గ్రామాల మీదుగా సాగిన ఈ యాత్రలో వైఎస్సార్ ప్రతి ఇంటి గుమ్మం తట్టాడు. రైతుల పొలాల్లోకి వెళ్లి వారి కష్టాలను తెలుసుకున్నాడు. ఆడపడుచుల బాధలను విన్నాడు. యువతలో నిస్పృహను గమనించాడు. ఈ పాదయాత్ర ద్వారా ఆయన ప్రజలతో కేవలం మాట్లాడలేదు వారి మనసులను చదివాడు. రైతుల పొలాల్లోనూ, పల్లెల వీధుల్లోనూ, చెట్ల నీడలోనూ జరిగిన సమావేశాల్లో వైఎస్సార్ ఇచ్చిన మాటలు ప్రజల్లో కొత్త ఆశలను నింపాయి.

**"రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తాను..."**
**"పేదలకు వైద్యం అందిస్తాను..."**
**"ప్రతి ఇంటికి ఓ ఇల్లు కల్పిస్తాను..."**

ఈ హామీలు అప్పట్లో కేవలం మాటలు కాదు ప్రజల జీవితాలను మార్చిన సంకల్పాలు. ప్రతి గ్రామంలో మార్మోగిన "జిందాబాద్ వైఎస్సార్" నినాదం, ప్రజలు ఆయనపై ఉంచిన నమ్మకానికి ప్రతీక. ఆ నమ్మకమే తరువాత చరిత్ర సృష్టించింది.

ప్రజా ప్రస్థానం ముందు వైఎస్సార్ ఒక రాజకీయ నాయకుడు. కానీ ఈ యాత్ర తర్వాత ఆయన ప్రజానాయకుడిగా మారాడు.
ఒక నాయకుడిని ప్రజానాయకుడిగా...
ఒక రాజకీయ నేతను జనహృదయ నేతగా...
ఒక రాజకీయ బంధువును ఆత్మబంధువుగా మార్చింది ఈ యాత్ర.ప్రజలతో నడిచిన నాయకుడు, వారి బాధలను అనుభవించిన నాయకుడు— అలాంటి వ్యక్తిని ప్రజలు తమలో ఒకరిగా భావిస్తారు. అదే వైఎస్సార్‌కు లభించిన గొప్ప గౌరవం.

2004 ఎన్నికలు ప్రజా ప్రస్థానం ప్రభావాన్ని స్పష్టంగా చూపించాయి. ప్రజలు తమ తీర్పుతో వైఎస్సార్‌ను ముఖ్యమంత్రిగా చేశారు. అది కేవలం ఒక రాజకీయ విజయం కాదు ప్రజల ఆశల విజయంగా నిలిచింది. ప్రజా ప్రస్థానం ద్వారా వినిపించిన ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా వైఎస్సార్ పాలన సాగింది. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత, ప్రజా ప్రస్థానం సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం ప్రారంభించారు.

**రైతులకు ఉచిత విద్యుత్...**
**ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు ఉచిత వైద్యం...**
**ఇందిరమ్మ ఇళ్లతో గృహ సౌకర్యం...**
**విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్...**


ఇలా ప్రతి వర్గానికి చేరువైన సంక్షేమ పథకాలు అమలు చేసి, ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చారు.ఈ పథకాల వల్ల లక్షలాది కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా బలోపేతమయ్యాయి. వైఎస్సార్ పాలనను ప్రజలు "స్వర్ణయుగం"గా గుర్తుచేసుకోవడం యాదృచ్ఛికం కాదు.

23 ఏళ్ల తర్వాత కూడా ప్రజా ప్రస్థానం ఒక స్ఫూర్తిగా నిలిచింది. వైఎస్సార్ ఇక లేరు, కానీ ఆయన చూపిన మార్గం ఇంకా ప్రజల మధ్య సజీవంగా ఉంది. ఆయన ఆలోచనలు, ఆయన సంక్షేమ దృష్టి, ఆయన ప్రజల పట్ల ఉన్న మమకారం ఇవన్నీ ఇంకా కోట్లాది ప్రజల గుండెల్లో నిలిచిపోయాయి. ప్రజా ప్రస్థానం ఒక యాత్ర కాదు; అది ఒక ఉద్యమం. ఒక భావోద్వేగం. ఒక విశ్వాసం.

11 జిల్లాలు, 68 రోజులు, 1475 కిలోమీటర్లు ఈ ప్రయాణం ఒక నాయకుడి కథ కాదు ఇది ప్రజల కథ.

**ఒక నాయకుడు కోసం...**
**ఒక స్వర్ణయుగం కోసం...**
**ఒక భవిత కోసం...**

ప్రజా ప్రస్థానం ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన చరిత్ర."జిందాబాద్ వైఎస్సార్" అనే నినాదం అప్పట్లో ఎలా మార్మోగిందో, ఈరోజు కూడా అదే ఉత్సాహంతో ప్రతిధ్వనిస్తోంది. ప్రజల కోసం నడిచిన నాయకుడి అడుగులు ఎప్పటికీ మాయం కావు అవి చరిత్రలో శాశ్వతంగా నిలుస్తాయి.



-అమరవాజీ నాగరాజు
టీపీసీసీ చీఫ్ పీఆర్ఓ



## సౌత్ సినిమా ఇండస్ట్రీలో

# అత్యంత ధనిక హీరోయిన్లు వీళ్లే..




### నయనతార

ఈ లేడీ సూపర్ స్టార్ ఈ జాబితాలో 1వ స్థానంలో ఉంది. టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రకారం నయనతార నికర ఆస్తుల విలువ రూ.200 కోట్లు. సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్లలో ఒకరు.



### అనుష్క శెట్టి

అనుష్క శెట్టి రెండో స్థానంలో ఉంది. అనుష్క దక్షిణాదిలో పలు హిట్ సినిమాల్లో నటించింది కానీ బాహుబలి సినిమాతో ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. ఆమె నికర సంపద రూ.135 కోట్లు.




### తమన్నా భాటియా

మిల్కీ బ్యూటీ మూడో స్థానంలో ఉ:ది. తమన్నా దక్షిణాదితో పాటు హిందీ చిత్రాల్లో అద్భుతాలు చేస్తోంది. ఆమె నికర ఆస్తుల విలువ రూ.110-120 కోట్లు.



### సమంత రూత్ ప్రభు

నాలుగో స్థానంలో సమంత ఉంది. పలు రిపోర్టుల ప్రకారం సమంత నికర సంపద రూ. 110-120 కోట్లు.




### త్రిష కృష్ణన్

త్రిష కృష్ణన్ తమిళ-తెలుగు సినిమాల్లో పెద్ద స్టార్. రిపోర్టుల ప్రకారం త్రిష నికర సంపద విలువ రూ.85-100 కోట్లు.



### కాజల్ అగర్వాల్

తరువాతి స్థానంలో కాజల్ అగర్వాల్ ఉంది. ఆమె నికర ఆస్తుల విలువ రూ.85 కోట్లు.



### రష్మిక మందన్న

ఈ నేషనల్ క్రష్ ఈ మధ్యే విజయ్ దేవరకొండతో పెళ్లితో వార్తల్లో నిలిచింది. పలు రిపోర్టుల ప్రకారం రష్మిక నికర సంపద రూ.66 కోట్లు.



### పూజా హెగ్డే

ఆ తర్వాత పూజా హెగ్డే ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఆమె నికర సంపద రూ.50 కోట్లు.



### సాయి పల్లవి

తొమ్మిదో స్థానంలో సాయి పల్లవి ఉంది. ఆమె దగ్గర సుమారు రూ.47 కోట్ల విలువైన సంపద ఉన్నట్లు పలు రిపోర్టులు వెల్లడించాయి



### శృతి హాసన్

చివరిగా 10వ స్థానంలో శృతి ఉంది. ఈమె నికర ఆస్తుల విలువ రూ.45 కోట్ల వరకూ ఉంటుందని అంచనా.

### పట్టణంలో వేసవి సెలవుల దృష్ట్యా
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- దొంగతనాలు అరికట్టేందుకు ప్రజలు జాగ్రత్త వహించాలి
- బెల్లంపల్లివన్ టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి పట్టణంలో వేసవి సెలవుల దృష్ట్యా పట్టణంలోని ప్రజలు దొంగతనాలు అరికట్టడానికి పోలీస్ శాఖకు సహకరించాలని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు.వేసవి సెలవులు సమీపిస్తున్నందున పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెల్లంపల్లి వన్ టౌన్ సిఐ కె శ్రీనివాస్ తమ పోలీసు సిబ్బందితో వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఇటీవల వరుసగా చైన్ స్నాచింగ్ దొంగతనాలు జరుగుతున్నాయని, వేసవి సెలవులు సమీపస్తున్నందున పట్టణ ప్రజలు జాగ్రత్తగా ఉండాలని,ఇటీవల కాలంలో పెద్ద పల్లి ,లక్సట్టిపేట్ లో జరిగిన చైన్ స్నాచింగ్ లను దృష్టిలోఉంచుకొని బెల్లంపల్లి పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బెల్లంపల్లి పట్టణంలో రైల్వే స్టేషన్ ఉన్నందున ఇతర రాష్ట్రాల నుంచి కూడా దొంగలు రావడానికి ఆస్కారం ఉందని,పట్టణ ప్రజలు ఎవరు కూడా అశ్రద్ధ చేయకుండా ఎవరైనా వేసవి సెలవులలో ఇల్లు వదిలి వెళ్లే ముందు ఇంటికి చక్కగా జాగ్రత్తగా తాళంవేసి వెళ్లాలని, తాళం వేసినట్లుగా కనపడకుండా కర్టన్ తో కవర్ చేయాలని,ఎల్లవేళలా లైట్లు వెలిగేలా చూసుకోవాలని, ప్రజలు వారి ఇంటిని వదిలి వెళ్లే ముందు పోలీసు వారికి సమాచారం ఇస్తే పోలీసు వారు కూడా సంబంధిత ఇండ్లలో ఎలాంటి దొంగతనాలు జరగకుండా ఫూట్ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు. ఇటీవల కాలంలో బంగారు ఆభరణాల దొంగతనం ఎక్కువగా నమోదవుతున్నందున ముఖ్యంగా మహిళలు బయటకు వెళ్లేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని ఊరు వెళ్లే ముందు విలువైన బంగారు ఆభరణాలు నగదు ఇంట్లో ఉండకుండా చూసుకోవలని,బంగారుఆభరణాలను లాకర్లోపెట్టుకోవాలని, ఇంటిచుట్టూ గాని పరిసర ప్రాంతాలలో గాని ఎవరైనా అనుమానితులు కనబడితే వెంటనే పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.సంబంధిత సమాచారాన్ని పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బెల్లంపల్లి వన్ టౌన్ సీఐ కె శ్రీనివాసరావు పోలీసు సిబ్బంది తో ఆటో మైక్ సిస్టంతో ప్రజలందరికీ అర్థమయ్యేలా బహిరంగంగా చాటింపు వేశారు. పట్టణ ప్రజలు ఎవ్వరు కూడా అధైర్యపడకుండా అప్రమత్తంగా ఉంటూ ఎలాంటి అనుమానం వచ్చినా డయల్ 100కు కాల్ చేసి పోలీసు వారికి సమాచారం ఇవ్వాలన్నారు.

# ఆర్టిజన్ల సమస్యలపై సర్కారు నిర్లక్ష్యం

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.. ప్రభుత్వం చర్చలకు పిలిచి సమ్మెను నివారించాలని డిమాండ్..**



**నల్లగొండ, మహా :** విద్యుత్ సంస్థలో దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఆర్టిజన్లను ప్రభుత్వం తక్షణమే చర్చలకు పిలిచి వారి సమస్యలను పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. టీవీఏసీ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టిజన్లు చేపట్టిన సమ్మె గురువారం రెండో రోజుకు చేరింది. నల్లగొండ జిల్లా కేంద్రంలోని విద్యుత్ కార్యాలయం వద్ద జరుగుతున్న నిరసనలో పాల్గొన్న ఆయన కార్మికులకు తన పూర్తి మద్దతును ప్రకటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టిజన్లు రెండు రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. గత 22 సంవత్సరాలుగా విద్యుత్ రంగం పురోగతిలో కీలక పాత్ర పోషిస్తున్న వీరిని విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ చేయాలని కోరారు. గత ప్రభుత్వం వీరిని గుర్తించినప్పటికీ ప్రస్తుత అధికారులు బ్రిటిష్ కాలం నాటి పాత నిబంధనలను సాకుగా చూపుతూ రెగ్యులర్ ఉద్యోగులకు, ఆర్టిజన్లకు మధ్య వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐటీఐ పూర్తి చేసిన వారిని జూనియర్ లైన్ మెన్లుగా, డిప్లొమా చేసిన వారిని సబ్ ఇంజనీర్లుగా మరియు ఇతరులను విద్యార్హతను బట్టి ఆఫీస్ సబార్డినేటర్లు, జూనియర్ అసిస్టెంట్లుగా గుర్తించాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.అరకొర వేతనాలతో జీవనం సాగిస్తున్న ఆర్టిజన్లకు ఉద్యోగ భద్రతతో పాటు ప్రభుత్వ పరంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం తక్షణమే మొండి వైఖరి వీడి కార్మిక సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శ్రావణ్ కుమార్, గీతా పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పబ్బు వీరస్వామి, జేఏసీ జిల్లా చైర్మన్ జిట్టబోయిన లింగస్వామి, నాయకులు గుండ లింగా రెడ్డి, పెరిక శేఖర్, వేణుగోపాల్ రెడ్డి, మురళి, అద్దంకి వెంకన్న, లతీఫ్, విజయ్, ఉమాదేవి, నాగమణి, రమ్య, సతీష్, ప్రవీణ్, రమేష్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

### లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి
## 10 సంవత్సరాలు జైలు శిక్ష

**పోలీస్ సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ మహేష్ బిగీతే**



**వేములవాడ,మహా:** మైనర్ బాలికలపై లైంగిక వేధింపులకు పాల్పడిన (ఫోక్సో) కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలు శిక్ష, 5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ఫోక్సో కోర్టు ప్రధాన న్యాయమూర్తి రాధిక జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఒక మైనర్ అమ్మాయిని వేములవాడ చెందిన ఏ 2 అయిన ఎదురుగట్ల అజయ్ తండ్రి ఎల్లయ్య, ఏ 1 గౌరవేణి నాగరాజు (జువేనైల్) ఇద్దరు కిడ్నాప్ చేసి బలవంతపు వేధింపులకు పాల్పడ్డారు. తండ్రి ఫిర్యాదు మేరకు నాటి వేములవాడ డి.ఎస్.పి వెంకటరమణ దర్యాప్తు చేపట్టి నిందితులను రిమాండ్ చేసి చార్జ్ షీట్ దాకాలు చేశారు. నేరం రుజువు కావడంతో ఏ 2 అయినా ఎదురుగట్ల అజయ్ కి 10 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 5000 రూపాయల జరిమానా విధించారు. అలాగే ఏ 1 అయినటువంటి నాగరాజు కేసు జువినల్ కోర్టులో నడుస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. సమాజంలో నేరం చేసిన వారు ఎవరైనా సరే శిక్ష నుంచి తప్పించుకోలేరని శిక్షణతోనే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. ఈ కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేసినటువంటి డిఎస్పి వెంకటరమణ, ప్రస్తుత సీఐ వీరప్రసాద్, పబ్లిక్ ప్రాజెక్ట్ ప్రాసిక్యూటర్ శ్రీనివాస్, సంబంధిత సిబ్బందికి ఎస్పి అభినందనలు తెలిపారు.

## లింగాపూర్ గ్రామంలో తొలగిన లో వోల్టేజ్ సమస్య



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామపంచాయతీలో దశాబ్దాల కాలంగా ఉన్న లోవోల్టే సమస్యకు గురువారం నాడు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినీత ఆదేశాలతో నూతన ట్రాన్స్ఫార్మర్ను బిగించగా తొలగిపోయింది.లింగాపూర్ గ్రామంలోని 3వ వార్డు, 4వ. వార్డ్ 5వ వార్డు, లో గత 12 సంవత్సరాలక్రితం నుండి లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్న లింగాపూర్ గ్రామప్రజల సమస్యను సర్పంచ్ తొంగల నర్మదా శ్రీనివాస్ గత 15 రోజుల క్రితం బెల్లంపల్లి శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి దృష్టి కి మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్ దృష్టికి తీసుకు వెళ్లగానే వెంటనే స్పందించిన ఎమ్మెల్యే తక్షణమే సమస్యను పరిష్కరించాలని విద్యుత్ శాఖ హుటాహుటిన ఆయన గ్రామానికి వెళ్లి స్పందించి తక్షణమే 25 కె వి సామర్థ్యం గల ట్రాన్స్ఫార్మర్ను అమర్చారు. దీంతో గ్రామ సర్పంచ్ నర్మదా శ్రీనివాస్ తో పాటు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లింగాపూర్ లైన్మెన్ శ్రీనివాస్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

### త్యాగాలు మావి..
# భోగాలు మీవా

- ఇంకా ఎంతమంది నేల కొరగాలి
- సంగిశెట్టి క్రిస్టఫర్, మలిదశ ఉద్యమకారుడు

**వలిగొండ మహా :**త్యాగాలు లేకుండా మీకు భోగాలు ఎక్కడివి అని మలిదశ ఉద్యమకారుడు టియుజెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంగిశెట్టి క్రిస్టఫర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు . గత ప్రభుత్వం త్యాగాల పునాదుల మీద అధికారంలోకి వచ్చి త్యాగాలు చేసిన ఉద్యమకారులను మరిచినందున ఆ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపిన సంగతి గుర్తించుకోవాలని ఆయన అన్నారు ఇప్పటికీ అనేకమంది ఉద్యమకారులు పిట్టలు రాలినట్లు రాలిపోతున్నారని ఇంకా ఎంతమంది నేలకొరగాలని అన్నారు . చనిపోయిన ఉద్యమకారుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పుడున్న ప్రభుత్వం కూడా వచ్చి రెండేళ్లు దాటిందని నేటి వరకు ఉద్యమకారుల ఊసే లేదని ఆయన విమర్శించారు ఉద్యమ సమయంలో ఉద్యమ ద్రోహులుగా వ్యవహరించిన వారు నేడు అధికారంలో భోగాల అనుభవిస్తున్నారని ఆయన ఎద్దేవా చేశారు జూన్ 2లోగా ఉద్యమకారులను గుర్తించకపోతే ప్రభుత్వం పతనం ఖాయమని ఆయన హెచ్చరించారు

## సెల్ టవర్‌కు వ్యతిరేకంగా ముమ్మరమైన పోరుబాట

**టవర్ ఎత్తివేసేంతవరకు ఆందోళనలు విరమించేది వందంటున్న స్థానికులు**



**కుషాయిగూడ, మహా :** చర్లపల్లి ఈసీ నగర్ కాలనీలోని కమ్యూనిటీ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సెల్ టవర్‌ను వెంటనే తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. గత నాలుగైదు రోజులుగా కాలనీవాసులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తూ తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ మధ్యలో సెల్ టవర్ ఏర్పాటు చేయడం వల్ల రేడియేషన్ ప్రభావంతో అనారోగ్య సమస్యలు పెరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా సమీపంలో పార్క్ ఉండటంతో అక్కడికి వచ్చే వృద్ధులు, చిన్నారులు రేడియేషన్ ప్రభావానికి ఎక్కువగా గురయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలు, గర్భిణీ స్త్రీలు కూడా ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని వారు వివరించారు. నివాస ప్రాంతంలో ఈ విధంగా సెల్ టవర్ ఏర్పాటు చేయడం సరికాదని, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో టవర్‌లకు అనుమతులు ఇవ్వకూడదని కాలనీవాసులు పేర్కొన్నారు. ఇప్పటికే పరిసరాల్లో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు, గుండె శస్త్రచికిత్స చేయించుకున్నవారు ఉన్నారని చెప్పి, మరింత ప్రమాదం తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. సమస్యపై సంబంధిత అధికారులకు, స్థానిక నాయకులకు, ఎమ్మెల్యేకు, జిల్లా కలెక్టర్‌కు పలు మార్లు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతులు ఎలా ఇచ్చారు, ఎవరి ఒత్తిడితో టవర్ ఏర్పాటు జరుగుతోందో వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్యం కంటే ప్రైవేట్ సంస్థల లాభాలను ముందుకు పెట్టడం తగదని మండిపడుతూ, వెంటనే పనులను నిలిపివేసి టవర్‌ను తొలగించాలని కోరారు. లేకపోతే నిరసనలను మరింత ఉధృతం చేసి పెద్ద ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కాలనీవాసులకు మద్దతుగా విద్యార్థులు వచ్చి నిరసన తెలిపారు సెల్ టవర్ వద్దు ఆరోగ్యమే ముద్దు షెల్ టవర్ ను ఎత్తివేసి మా ఆరోగ్యాలను పరిరక్షించండి అంటూ ప్రభుత్వానికి వేడుకున్నారు గత రెండు నెలల నుండి షెల్ టవర్ కు వ్యతిరేకంగా పోరాడుతున్నామని ఇప్పటికైనా కాలనీ అధ్యక్షుడు శ్రావణ్ కుమార్ గౌడ్ పద్ధతిని మార్చుకోవాలని కాలనీవాసులు హెచ్చరించారు. ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పట్టించుకోవాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో కడియాల జనార్ధన్, లక్ష్మారెడ్డి, కడియాల రాకేష్, కొమ్ము రమేష్, ఫ్రాంచెస్, మొగులయ్య, సురేష్, కడియాల ప్రణయ్, శ్రీకర్, డేవిడ్, అభినవ్, మోహన్ రావు, రోహిత్, నాగేష్, వెంకటేష్, అశోక్, బాలలక్ష్మి, విజయలక్ష్మి, రిత తదితరులు పాల్గొన్నారు.



### తహసిల్దార్ ను కలిసిన
# బిజెపి నాయకులు

**సదాశివపేట :మహా:** సదాశివపేట మండల నూతన తహసీల్దార్ గా బాధ్యతలు స్వీకరించిన జి. హరిచంద్ర ప్రసాద్ ను బిజెపి మండల పార్టీ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. బిజెపి పార్టీ మండల అధ్యక్షులు కర్ణం ఆదిత్య ఆధ్వర్యంలో నూతన తహసిల్దార్ ను ఆయన చాంబర్ లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను పుష్ప గుచ్చాలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల జనరల్ సెక్రెటరీ నామ హరీష్ , నాయకులు జగన్నాథ్ రెడ్డి, లక్ష్మణ్, నాగరాజు, సుభాన్, ప్రసాద్, అనిల్ ప్రశాంత్, దుర్గరాజు , శ్రీకాంత్ సాకేత్ తదితరులు పాల్గొన్నారు.

### జనహిత సేవాసమితి ఆధ్వర్యంలో..
## నిరుపేద ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సాయం అందజేత



**బెల్లంపల్లి ,మహా:**బెల్లంపల్లి పట్టణంలో హనుమాన్ బస్తి (33 వ వార్డు)లో నిరుపేద ఆడబిడ్డ అకిరెడ్డి అనూష పెళ్లికి రూ. 6025/ పెళ్లి ఖర్చులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో 33 వ వార్డు కౌన్సిలర్ పోలు ఉమాదేవి శ్రీనివాస్ తో పాటు తిలక్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



## చాయ్ పే ములాఖాత్‌లో బిజెపి వ్యూహాలపై చర్చ

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్ డివిజన్‌కు చెందిన బిజెపి సీనియర్ నాయకుడు రాజేష్ పటేల్ నివాసంలో “చాయ్ పే ములాఖాత్” కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర బిజెపి అధికార ప్రతినిధి తాడూరి శ్రీనివాస్‌తో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, బూత్ స్థాయి కార్యకలాపాల పెంపు, యువతను ఆకర్షించే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి వార్డులో పార్టీని బలోపేతం చేయడానికి కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని నాయకులు సూచించారు. కార్యకర్తలతో నేరుగా మమేకమవుతూ వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్న తాడూరి శ్రీనివాస్, పార్టీ కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే దిశగా మరింత చురుకుగా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా రాబోయే కార్యక్రమాలు, సమావేశాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై కూడా చర్చించి, సమన్వయంతో ముందుకు సాగాలని నిర్ణయించారు. కార్యక్రమం చివర్లో నేతలు, కార్యకర్తలు కలిసి చాయ్ సేవిస్తూ చర్చలు కొనసాగించారు.

# కాప్రాలో వికలాంగుల గ్రీవెన్స్



- 96 మంది నుంచి వినతులు స్వీకరణ
- సమస్యల పరిష్కారానికి హామీ

**కుషాయిగూడ, మహా :** కాప్రా మున్సిపల్ కార్యాలయంలో వికలాంగుల కోసం ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ చైర్మన్ ముతినేని వీరయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ప్రజాపాలనలో భాగంగా వికలాంగుల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి గ్రీవెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా సుమారు 96 మంది వికలాంగులు తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించారు. డబుల్ బెడ్రూమ్ ఇళ్లు, పెన్షన్లు, వైద్య సహాయం, మౌలిక సదుపాయాలపై ఎక్కువగా వినతులు వచ్చాయని తెలిపారు. ప్రతి దరఖాస్తును పరిశీలించి అర్హులైన వాటిని వెంటనే సంబంధిత అధికారులకు పంపినట్లు చెప్పారు. ప్రభుత్వం వికలాంగుల సంక్షేమానికి పలు పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. వివాహం చేసుకునే వికలాంగులకు అదనపు ఆర్థిక సహాయం, ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు, ఉన్నత విద్యలో రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు వివరించారు. అలాగే క్రీడాకారులకు ప్రత్యేక పారా స్పోర్ట్స్ విధానం, సహాయక ఉపకరణాల పంపిణీ కొనసాగుతున్నట్లు తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి, డిప్యూటీ కమిషనర్, ప్రాజెక్ట్ ఆఫీసర్, సీడీపీవో, ఇతర విభాగాల అధికారులు, ఎన్‌పిఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, టీవీహెచ్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గుత్తికొండ కిరణ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, మహా :** సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో డిసిపి ఎ. భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్ లతో కలిసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణపై జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో ఎల్.పి.జి. సరఫరాలో ఏర్పడిన అంతరాయాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు, పైప్‌లైన్ సహజ వాయువు వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పనులకు సంబంధించిన అనుమతులను 24 గంటలలో మంజూరు చేసే విధానాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని, ఆలస్యం అయితే ‘డీమ్డ్ పర్మిషన్ గా పరిగణించడం జరుగుతుందని వెల్లడించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఏర్పాటుకు సంబంధించిన రెంటల్/లీజ్ ఛార్జీలను తాత్కాలికంగా మాఫీ చేసినట్లు వివరించారు. పనుల వేగవంతానికి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలకు 24 గంటల పని సమయం, శబ్ద కాలుష్యం నిబంధనలను పాటించేలా అనుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పి.ఎన్.జి., ఎల్.పి.జి. మధ్య సమన్వయాన్ని పౌరసరఫరాల శాఖ సమర్థవంతంగా నిర్వహించాలని, అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని, ప్రజలకు నిరంతర ఇంధన సరఫరా అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాసరావు, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# లక్ష ఇస్తే.. ఐదు లక్షల నకిలీ నోట్లు!

- విదేశీ కేటుగాడి అరెస్ట్..
- నల్ల రంగు కాగితాలతో అమాయకులకు కుచ్చుటోపి..
- వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్..





**నల్లగొండ, మహా :** రంగు పూసిన కాగితాలను రసాయనంతో కడిగితే అసలు నోట్లుగా మారుతాయని నమ్మబలికి అమాయకులను మోసం చేస్తున్న పశ్చిమ ఆఫ్రికాకు చెందిన నిందితుడిని తిప్పర్తి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ కేసు వివరాలను వెల్లడించారు. పశ్చిమ ఆఫ్రికాలోని మాలి దేశానికి చెందిన గోయిటా సౌంగాలో (53) రెండేళ్ల క్రితం భారత్‌కు వచ్చాడు. తొలుత బెంగళూరులో పండ్లు విక్రయిస్తూ జీవనం సాగించిన అతడు అనంతరం హైదరాబాద్‌లోని టోలిచౌకి ప్రాంతానికి మకాం మార్చాడు. జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మరో నిందితుడు సల్మాన్ అలియాస్ ఉమా దాలియాతో కలిసి నకిలీ కరెన్సీ పేరుతో మోసాలకు తెరలేపాడు. వాట్సాప్ ద్వారా అమాయకులను సంప్రదించి ఒక లక్ష అసలు రూపాయలకు ఐదు లక్షల విలువైన 500 నోట్లు ఇస్తామని నమ్మబలికేవారు. నల్ల రంగు పూసిన నోట్లను ప్రత్యేక రసాయనంతో కడిగి అసలు నోట్లుగా మార్చి ప్రదర్శన ఇచ్చి బురిడీ కొట్టించేవారు.ఈ నెల 6న తిప్పర్తి మండలం మల్లేపల్లి వారిగూడెం దాబా వద్ద వంగూరి జానయ్య అనే వ్యక్తికి రూ. 5 లక్షల విలువైన కరెన్సీ కట్ట అని చెప్పి రూ. లక్ష వసూలు చేశారు. పైభాగంలో నాలుగు అసలు నోట్లు పెట్టి లోపల నల్లటి కాగితాలు ఇచ్చారు. ఇంటికి వెళ్లి రసాయనంతో కడిగినా అవి మారకపోవడంతో జానయ్య తాను మోసపోయినట్లు గుర్తించాడు. నిందితుడిని పట్టుకోవాలని పథకం పన్ని తన స్నేహితుడు అభిరామ్ సహాయంతో మరో రూ. 10 లక్షల నోట్లు కావాలని నిందితుడిని సంప్రదించాడు. గురువారం మధ్యాహ్నం తిప్పర్తి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చిన నిందితుడిని బాధితులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

**రసాయనాలు, నకిలీ కాగితాల స్వాధీనం..**

నిందితుడి నుంచి నాలుగు కట్టల నల్లటి కాగితాలు, రసాయన ద్రావణం, పౌడర్, ఒక మొబైల్ ఫోన్ మరియు నాలుగు అసలు 500 రూపాయల నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి వీసా గడువు 2024 ఆగస్టులోనే ముగిసినట్లు గుర్తించారు. గతంలో ఇతనిపై మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన డీఎస్పీ శివరాం రెడ్డి, సీఐ కొండల్ రెడ్డి, ఎస్సై శంకర్ మరియు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. తక్కువ డబ్బుకు ఎక్కువ కరెన్సీ ఇస్తామనే మోసగాళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

# విద్యుత్ ఆర్టిసన్ల సమ్మె ఉధృతం







- సైనిక్‌పురి డివిజన్ కార్యాలయం వద్ద వినూత్న నిరసన
- అమ్మవారికి బోనాలు, వనభోజనాలు
- రెండవ రోజుకు చేరిన విద్యుత్ కార్మికుల ఆందోళన

**కుషాయిగూడ, మహా :** తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం దక్షిణ మండల విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్ పీడీసీఎల్) ఆర్టిసన్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె రెండవ రోజుకు చేరింది. గురువారం సైనిక్‌పురి డివిజన్ కార్యాలయ ఆవరణలోని నల్ల పోచమ్మ దేవాలయం వద్ద కార్మికులు వినూత్నంగా నిరసన తెలిపారు. అమ్మవారికి బోనాలు సమర్పించి, అక్కడే వనభోజనాలు చేస్తూ తమ ఐక్యతను చాటారు. డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్ల నుండి తరలివచ్చిన కార్మికులు పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ పరిసరాలను హోరెత్తించారు. సంస్థను నమ్ముకుని రాత్రింబవళ్లు శ్రమిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం బేఖాతరు చేయడంపై నాయకులు మండిపడ్డారు. యాజమాన్యం తమ పద్ధతి మార్చుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమం మరింత ఉధృత రూపం దాలుస్తుందని హెచ్చరించారు. డిమాండ్లు నెరవేరే వరకు విధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో హబ్సిగూడ సర్కిల్ జాక్ చైర్మన్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కార్మికులు సంఘటితమయ్యారు. కార్యక్రమంలో క్రిస్టోఫర్, జానయ్య, మల్లారెడ్డి, పైసా రవి, మోహన్ రావు, జానీ, ప్రసాద్, జమాల్, నరేష్ గౌడ్, విజయ్, కృష్ణ, రమేష్, రాజు, వెంకటేష్, దేవకుమార్, మహిళా కార్మికులు సుగుణ, లక్ష్మి, మమత, విజయ తదితరులు బోనాలతో నిరసనలో పాలుపంచుకున్నారు.



ANN
MAHAA
AWARDS
KATRIYA HOTEL
& TOWERS
HYDERABAD
★★★★★
11th April | 5 PM Onwards
ANN TELUGU
FASTEST GROWING TELUGU NEWS CHANNEL
ANNTELUGU
ANNTELUGU
ANNTELUGU
CONTACT NO.: 96662 94446



## హిట్ సాంగ్స్ అన్నీ పీరియడ్స్ లో ఉండగానే చేశా..

# సాకుగా చూపించొద్దు!

శ్రీలీల.. తక్కువకాలంలోనే ఎక్కువ గుర్తింపు తెచ్చుకుంది. స్టార్ హీరోల సరసన సినిమాలు చేసింది. సన్నజాజి తీగలా ఉండే ఈ బ్యూటీ తన డ్యాన్స్ స్టెప్పులతో మరింత ట్రెండ్ అయింది. అయితే తాను నటించిన చాలా పాటలు పీరియడ్స్‌లో ఉండగానే చిత్రీకరణ జరిగాయంటోంది. తాజాగా ఓ ఈవెంట్‌లో శ్రీలీల మాట్లాడుతూ.. 'నేను చాలా పాటలకు డ్యాన్స్ చేశాను. అందులో హిట్ సాంగ్స్ అన్నీ దాదాపు నెలసరి సమయంలో చేసినవే! సమానత్వం కోరుకున్నప్పుడు మనం పీరియడ్స్‌ను సాకుగా చూపించకూడదని నా అభిప్రాయం.

**సాకుగా చూపించొద్దు**

మనం శారీరకంగా, మానసికంగా అన్నింటిని అధిగమించి ముందుకు సాగాలి. పురుషులతో సమానంగా అవకాశాలు, అధికారం, హక్కులు కోరుతున్నప్పుడు నెలసరి వంటి సమస్యలను సాకుగా చూపించి వెనక్కు తగ్గడం కరెక్ట్ కాదు. మనల్ని మనం ముందుకు నెట్టుకోవాలి' అని పేర్కొంది. అయితే ఆమె కామెంట్స్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నెలసరిలో అందరి పరిస్థితి ఒకేలా ఉండదని, దాన్ని ఎవరూ కావాలని సాకుగా చూపించరని కామెంట్లు చేస్తున్నారు.

**తప్పేముంది?**

డాక్టర్ చదివిన శ్రీలీలకు ఈ విషయం ఎందుకు అర్థం కావడం లేదని ప్రశ్నిస్తున్నారు. మరికొందరేమో.. పీరియడ్స్‌లో ఉన్నప్పుడు కూడా పనిచేసేవారు ఎంతమంది లేరు, ఆ ఉద్దేశంతోనే ధైర్యంగా ముందుకు వెళ్లాలని చెప్పిందే తప్ప.. తప్పుగా ఏం మాట్లాడిందని మరికొందరు శ్రీలీలను సమర్థిస్తున్నారు. ఇకపోతే శ్రీలీల చివరగా ఉస్తాద్ భగత్ సింగ్‌లో నటించింది. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్‌గా నిలిచింది.



# సమయం ఇవ్వండి..

## సౌత్ ఫ్యాన్స్ కు కయదు లోహర్ రిక్వెస్ట్

డ్రాగన్ చిత్రంతో కోలీవుడ్‌కు ఎంట్రీ ఇచ్చిన ఈ అస్సామీ భామ కయాదు లోహర్. ఆ చిత్రం అనూహ్య విజయంతో ఈమె పేరు సినీ వర్గాల్లో మారుమోగింది. అంతే ఇతర భాషల్లోనూ అవకాశాలు రావడం మొదలెట్టాయి. మలయాళం, తెలుగు, కన్నడం, మరాఠి భాషల్లో నటిస్తున్నారు. ఈమె తెలుగులో నటించిన ఫంకీ చిత్రం ఇటీవల విడుదలైంది. ఆశించిన విజయాన్ని సాధించలేదు. ఇకపోతే మలయాళంలో నటించిన పళ్లిచటంబి చిత్రం త్వరలో తెరపైకి రానుంది.

ఇలా పలు భాషల్లో చుట్టేస్తున్న కయదు లోహర్(Kayadu Lohar) ఇటీవల ఒక భేటీలో పేర్కొంటూ తమిళంలో స్పష్టంగా మాట్లాడటం లేదే అని అడుగుతున్నారనీ, ఇప్పుడే ఒక్కో భాషల్లో చిత్రాలు చేస్తున్నానని, అయితే తాను దక్షిణాదికి చెందిన అమ్మాయిని కాదని అన్నారు. అయినా తనవల్ల అయినంత వరకూ ఒక్కో భాషను నేర్చుకోవడానికి యత్నిస్తున్నానని అన్నారు. ఏ భాషలో నటించినా, ఆ భాషలో మాట్లాడటమే ముఖ్యం అన్నారు. అందుకే ఇతర భాషలను నేర్చుకోవడానికి నూరు శాతం ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కొంచెం సమయం ఇవ్వండి తమిళం, తెలుగు, మలయాళం తదితర దక్షిణాది భాషల్లో సరళంగా మాట్లాడతానన్నారు.

డ్రాగన్ చిత్రం తరువాత కోలీవుడ్‌లో వరుసగా నటించకపోవడానికి కారణం ఏమిటన్న ప్రశ్నకు తాను మంచి కథా చిత్రం కోసం ఎదురు చూస్తున్నానని, మంచి సక్సెస్‌ఫుల్ చిత్రంతో మళ్లీ వస్తానని చెప్పారు. డ్రాగన్ చిత్రంతో తమిళ ప్రేక్షకులు తనపై చూసిన ప్రేమాభిమానాలు చాలా ఎక్కువ అన్నారు. కాబట్టి వైవిధ్యభరిత కథా చిత్రాల్లో నటించి వారిని అలరించాలని కోరుకుంటున్నానన్నారు. కాగా తెలుగులో ఈ అమ్మడు నానికి జంటగా ది పారడైజ్ చిత్రంలో నటిస్తున్నారు. అదే విధంగా ఇంతకు ముందు తమిళంలో నటించిడానికి అంగీకరించిన ఇమ్మార్టల్, ఇదయం మురుళి చిత్రాలు విడుదల కావలసి ఉంది. కాగా నటుడు శింబుకు జంటగా ఆయన 49వ చిత్రంలో నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనితో పాటు మరో మలయాళ చిత్రంలోనూ నటిస్తున్నారీ బ్యూటీ.



## నాకు లక్ లేదనడం

# బాధగా ఉంది

## హీరోయిన్ కృతీ శెట్టి

*"ఓ నటిగా నేను చేసే ప్రతి సినిమాకు వంద శాతం కష్టపడతాను. అయితే కొన్ని సినిమాలకు సరైన బాక్సాఫీస్ ఫలితాలు రాలేదు. దీంతో నా హార్డ్‌వర్క్ గురించి కాకుండా నాకు లక్ లేదని కామెంట్ చేస్తున్నారు. అది నాకు బాధగా ఉంది. సినిమా రిజల్ట్ అనేది నా చేతిలో ఉండదు. కానీ అలాంటి కామెంట్స్ వల్ల ఒక అవకాశం మిస్ కావడమనేది బాధగా ఉంటుంది. ఇప్పుడు 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా రిలీజవుతోంది.*

'ఈ సినిమాలో ఈ అమ్మాయి ఉంది కాబట్టి డౌట్‌గా ఉంది' (సినిమా రిజల్ట్‌ను ఉద్దేశించి) అని కామెంట్ చేస్తున్నారు. నన్ను అభిమానించే తెలుగు ప్రేక్షకులు ఇలా అనుకోవడం నాకు బాధగా ఉంది. కానీ ఎప్పటిలానే ప్రతి సినిమాకీ నా వంతు కృషి చేస్తాను" అని చెప్పారు కృతీ శెట్టి. ప్రదీప్ రంగనాథన్, కృతీ శెట్టి హీరో హీరోయిన్లుగా నటించిన తమిళ సినిమా 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ'. విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో నయనతార నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. శ్రీ పద్మినీ సినిమాస్ ద్వారా ఈ చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా కృతీ శెట్టి చెప్పిన విశేషాలు.ఈ చిత్రంలో నేను ధీమా అనే పాత్ర పోషించాను. తనకు నోమోఫోబియా. అంటే ధీమా దగ్గర మొబైల్ ఫోన్ లేకపోతే ఆమెకు భయం వేస్తుంది. సోషల్ మీడియాకి బానిస అయిన అమ్మాయి. ఈ పాత్ర చేయడం నాకు కొత్తగా అనిపించింది.

ఈ సినిమాతో నయనతారగారితో మంచి అనుబంధం ఏర్పడింది. ఓ ప్రాబ్లమ్ వచ్చి, నయనతారగారికి ఫోన్ చేయగా, ఆమె మంచి సలహా ఇచ్చారు... చక్కగా గైడ్ చేశారు. 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' కథ 2040లో జరిగినా అందరూ రిలేట్ అయ్యేలా ఉంటుంది. ఎందుకంటే... ఇప్పుడు కూడా అందరూ మొబైల్ ఫోన్స్, సోషల్ మీడియాను ఎక్కువగానే వినియోగిస్తున్నారు. నెగటివ్ ట్రోల్స్ చేసేవారు నెగటివ్‌గా థింక్ చేస్తుంటారు. ఈ ఆలోచనా ధోరణి వాళ్ల జీవితాలపై కూడా చెడు ప్రభావాన్ని చూపించవచ్చు. పాజిటివ్ థింకింగ్ చాలా ముఖ్యం. ఈ మధ్య అందరూ అన్నీ ఇన్సూరెన్స్ చేయిస్తున్నారు. ఏమో... భవిష్యత్‌లో లవ్‌ను ఇన్సూరెన్స్ చేసే చాన్స్ ఉంటే, అలా చేస్తారేమో. నాకైతే పాత కాలపు ప్రేమలంటేనే ఇష్టం. ప్రస్తుతం నా ఫోకస్ అంతా యాక్టింగ్‌పైనే ఉంది. ఐదేళ్ల తర్వాతో, పదేళ్ల తర్వాతో... ఒక వ్యక్తితో డేటింగ్ చేసి, ఆ వ్యక్తినే పెళ్లి చేసుకుంటాను. ప్రస్తుతం తెలుగులో అనిల్ రావిపూడిగారితో సినిమా చేస్తున్నాను. తమిళంలో ఓ సినిమా అంగీకరించాను. హిందీలో ఓ సినిమా కోసం చర్చలు జరుగుతున్నాయి..

## ఎండు మిర్చి ఒక్కటే సరిపోదు..

# మొత్తం తగలబెట్టేయాల్సిందే..

## సందీప్ రెడ్డి వంగా కౌంటర్

బాక్సాఫీస్ వద్ద దూసుకెళ్తోన్న దురంధర్ మూవీపై టాలీవుడ్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా ఆసక్తికర ట్వీట్ చేశారు. నిన్న రాత్రి ఈ సినిమా చూశానని.. చాలా అద్భుతంగా ఉందని కొనియాడారు. అదే సమయంలో విమర్శకులపై తన స్టైల్లో ఇచ్చిపడేశారు. రచయితలు, నటులు అనేవాళ్లు ప్రాపగండతోనే తమ కెరీర్ నిర్మించుకున్నారని.. కానీ ఇప్పుడు ఇండస్ట్రీ మాత్రం పిల్లుల్లా సైలెంట్ అయిపోయిందన్నారు. ఇప్పుడదే వర్గం దురంధర్‌ను ఎగతాళి చేస్తోందని సందీప్ రెడ్డి వంగా విమర్శించారు. మీ మొదటి ప్రవృత్తి ఎగతాళి చేయడమే అయితే.. మిమ్మల్ని మీరు ఉదారవాదులు అని పిలిపించుకోలేరని రాసుకొచ్చారు. నిజానికి ప్రాపగండ అనే ముద్ర ఎప్పుడు పడిందో తెలియదన్నారు. ఈ విషయంలో ఆదిత్య ధర్, రణ్‌వీర్ సింగ్‌కు నేను ఒక్కటే చెప్పాలనుకుంటున్నా.. దురంధర్ మూవీకి ఈ నల్ల దృష్టి ఇలా వెళ్లదు... గుప్పెడు మిరపకాయలతో పని జరగదు.... మొత్తం పొలం తగలబెట్టాల్సిందే అంటూ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కాగా.. కొందరు దురంధర్ రిలీజైనప్పటి నుంచి ప్రాపగండ ముద్ర వేస్తూ విమర్శలు చేస్తున్నారు. వారికి తన ట్వీట్‌తో ఇచ్చిపడేశారు యానిమల్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా. ప్రస్తుతం ఆయన ప్రభాస్‌తో స్పిరిట్ అనే మూవీ చేయనున్నారు. ఈ మూవీ కోసం రెబల్ స్టార్ ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ భామ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com